సాక్షి నారాయణపేట

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



గంజాయి కలకలం

ఉమ్మడి జిల్లాలో గంజాయి సాగు, రవాణా, అమ్మకాలు కలకలం రేపుతున్నాయి.

వివరాలు 8లో ▸



ప్రారంభానికి ముస్తాబు


జడ్చర్ల సమీపంలో నిర్మించిన ఏరియా ఆస్పత్రి భవనం ప్రారంభానికి ముస్తాబవుతోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.4 /26.4

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం నిర్మలంగా, ఎండగా ఉంటుంది. ఉక్కపోత పెడుతుంది. వేడిగాలులు వీస్తాయి.



రికవరీ అయ్యేనా?



మరికల్ రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ డీఎం హథిరాం

సీఎంఆర్ ధాన్యం అమ్ముకున్న రైస్ మిల్లర్లు

- ఈనెల 30తో ముగియనున్న 2021-22 రబీ సీజన్ గడువు
- అప్పగించాల్సిన బియ్యం 92వేల మెట్రిక్ టన్నులు
- మే చివరి వరకు అవకాశం ఇవ్వాలంటున్న మిల్లర్లు

మద్దూరు: జిల్లాలో కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వందశాతం లక్ష్యం పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించారు. 2021-22 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి రైస్‌మిల్లర్లకు కేటాయించిన లెవీ గడువు ఈనెల చివరి వరకు ముగియనుంది. 2021-22 వానాకాలం సేకరణ 93.75 శాతం చేయగా.. యాసంగిలో ఇప్పటివరకు 49 శాతమే పూర్తయ్యింది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో మిల్లర్లకు ఇచ్చిన ధాన్యంలో ఐదుశాతం మాత్రమే బియ్యం సేకరణ చేశారు. దీంతో మూడు సీజన్లకు కలిపి 92,069 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల నుంచి అధికారులు సేకరించాల్సి ఉంది.

రికవరీ అయ్యేనా?

గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో ఇబ్బడిముబ్బడిగా ధాన్యం రావడంతో జిల్లాలోని మిల్లులకే కాకుండా మహబూబ్‌నగర్ మిల్లులకు కూడా అధికారులు ధాన్యం కేటాయించారు. ఇదికాక ధాన్యం నిల్వ చేయడానికి స్థలాలు లేకపోవడంతో ఫంక్షన్ హాళ్లలోనూ నిల్వ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం అప్పగించడం, దీనికితోడు ధాన్యం నిల్వ చేయడానికి గోదాములు లేకపోవడాన్ని గమనించిన మిల్లర్లు చాల వరకు ధాన్యంను పక్కదారి పట్టించారు. దీంతో ఇప్పుడు ఎఫ్‌సీఐకి ఇవ్వడానికి మిల్లర్ల వద్ద సరిపడా ధాన్యం నిల్వలు లేకుండాపోయాయి. గతేడాది ఖరీఫ్ 5,292 మెట్రిక్ టన్నులు, రబీ సీజన్‌లో 32వేల 834 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవాల్సి ఉంది. ఈ బియ్యం సేకరణ కోసం అధికారులు మిల్లర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు.

జిల్లాలో ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులు **61**

రా రైస్‌మిల్లులు **56** | పారాబాయిల్డ్ **5**

గడువు పెంచాలి..



గతేడాది రెండు సీజన్లలో సీఎంఆర్ కేటాయింపులు రెట్టింపు చేశారు. దీనికితోడు సరైన ధాన్యం నిల్వలకు సరిపడా గోదాములు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. మే చివరి వరకు ఎఫ్‌సీఐకి అందజేసే బియ్యం గడువు పెంచితే బాగుంటుంది.

– కల్లపు దినేష్, జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్, కార్యదర్శి, మద్దూరు

మిల్లర్లను అప్రమత్తం చేస్తున్నాం..



బియ్యం సేకరణపై మిల్లర్లను అప్రమత్తం చేస్తున్నాం. గత ఏడాది రెండు సీజన్లకు కేటాయించిన ధాన్యంను మర ఆడించి అనుకున్న లక్ష్యం పూర్తిచేయాలని చెబుతున్నాం. సేకరణపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు మిల్లులను పరిశీలిస్తున్నాం. మిల్లర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు.

– హథిరాం, సివిల్ సప్లయ్ డీఎం

ఎఫ్‌సీఐకి మిల్లర్లు అందజేయాల్సిన బియ్యం

సీజన్	మిల్లర్లుఅందజేయాల్సిన బియ్యం	అందజేసింది	ఇంకా చేయాల్సింది
2021-22 ఖరీఫ్	81,030 మెట్రిక్ టన్నులు	75,738మె.ట	5,292మె.ట
2021-22 రబీ	64,401	31,567	32,834
22-23 ఖరీఫ్	57,191	3,248	53,943

అంతంతమాత్రంగానే అప్పగింత..

జిల్లాలోని మొత్తం 61 రైస్‌మిల్లులకు 2021-22 ఖరీఫ్, రబీ, 2022-23 ఖరీఫ్ సీజన్‌లకు మిల్లింగ్ చేయడానికి ధాన్యం కేటాయించారు. అందులో 56 రా రైస్‌మిల్లులు, 5 పారాబాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. వీటికి మూడు సీజన్‌లు కలిపి ధాన్యం సేకరించి అందజేశారు. అయితే గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 81వేల 30 మెట్రిక్ టన్నుల ధాన్యం ఎఫ్‌సీఐకి అందజేయాల్సి ఉండగా మిల్లర్లు 75,738 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అందజేశారు. ఇంకా 5,292 మెట్రిక్ టన్నులు అందజేయాల్సి ఉంది. ఇదే ఏడాది రబీ సీజన్‌లో 64వేల 401 మెట్రిక్ టన్నుల ధాన్యం అందజేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 31వేల 567 మెట్రిక్ టన్నులు మాత్రమే అందజేశారు. ఇంకా 32,834 మెట్రిక్ టన్నుల ధాన్యం ఎఫ్‌సీఐకి అందజేయాల్సి ఉంది. అయితే ఈ ధాన్యం ఈనెల 30 వరకు అందజేయాలి. లేకపోతే మిల్లులకు ధాన్యం కేటాయించడం కుదరదని జిల్లా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎఫ్‌సీఐకి 57,191 మెట్రిక్ టన్నుల ధాన్యం అందజేయాల్సి ఉండగా, 3,248 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అందజేశారు. 53,943 మెట్రిక్ టన్నుల ధాన్యం అందజేయాల్సి ఉంది.

న్యూస్‌రీల్

నిరుద్యోగ మార్చ్‌కు భారీగా తరలిరండి



నారాయణపేట రూరల్: పాలమూరు గడ్డపై బీజేపీ చేపడుతున్న నిరుద్యోగ మార్చ్‌కు అత్యధిక సంఖ్యలో యువత తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25న పాలమూరులో బీజేపీ నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్‌కు జిల్లా నుంచి పెద్దఎత్తున యువత, నిరుద్యోగులు తరలి వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఉద్యోగ నియామకాలు లేక ప్రతి ఇంట్లో వయస్సు పిల్లలు ఖాళీగా ఉంటున్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్, కార్యవర్గ సభ్యులు నాగురావు నామాజి, రతంగపాండు రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, కార్యదర్శి ప్రభాకరవర్ధన్, సత్యాయాదవ్, నర్సింహులు, కర్నెస్వామి, గోవర్ధన్‌గౌడ్, లక్ష్మి, వివిధ మండల బాధ్యులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



నారాయణపేట టౌన్: పేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేదా ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షలు అందించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లను నేటికీ ఇవ్వలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖను ఎత్తివేసి పేదలకు అన్యాయం చేసిందని అన్నారు. వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ నాయకులు ప్రశాంత్, చెన్నారెడ్డి, హాజీమలంగ్, నరసింహ, సౌజన్య, పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ, పీవైఎల్ జిల్లా కార్యదర్శి సలీం రాములు, వెంక్రటాములు, నరసింహులు, రాము, రైతుసంఘాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'రైతులకు వెన్నెముక మా ప్రభుత్వం'



నర్వలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి

నర్వ: రైతాంగానికి వెన్నెముకగా నిలిచిన మా ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం నర్వ పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రెండు పంటలకు సరిపడా సాగు నీటిని అందించామన్నారు. రైతులు పండించిన పంటలో ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోని దళారులకు ధాన్యాన్ని విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. సూచించిన మేరకు 17శాతంలోపు తేమ ఉండేలా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గౌనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, రైతుసమన్వయ సమితి మండల అధ్యక్షుడు మండ్ల చిన్నయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లెశేఖర్, రాములునాయక్, లింగన్న, నాయకులు కిరణ్‌ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి 'కూచుకుళ్ల'..?

బీఆర్ఎస్‌ను వీడనున్న ఎమ్మెల్సీ

- ఎమ్మెల్యేతో వైరమే కారణం
- బీజేపీ నుంచి సైతం ఆహ్వానం
- పాత గూటికి చేరేందుకే దామోదర్‌రెడ్డి మొగ్గు
- జూపల్లి సైతం హస్తం చెంతకే..
- రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకుడు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయన ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. అయితే పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలన్న కల చిరకాల స్వప్నంగానే మిగిలిపోయింది. దీంతో పాటు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో వైరం ముదరడంతో గులాబీ పార్టీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న వేళ ఈసారి ఆయన భవిష్యత్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నాలుగు దశాబ్దాలుగా ప్రజాజీవనంలో..

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. 1980ల్లో కాంగ్రెస్ పార్టీలో చేరి స్వగ్రామం తూడుకుర్తి సర్పంచ్‌గా ప్రయాణం మొదలుపెట్టిన దామోదర్‌రెడ్డి ఆ తర్వాత టీడీపీలో చేరి నాగం జనార్దన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా మారి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత నాగంతో విభేదించి కాంగ్రెస్‌లో చేరినా.. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ ఓడిపోయారు. 2004లో పొత్తులో భాగంగా నాగర్‌కర్నూల్ టికెట్‌ను టీఆర్ఎస్‌కు కేటాయించడంతో ఆ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసినా టీడీపీ అభ్యర్థి నాగం చేతిలో ఓటమి తప్పలేదు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన కూచుకుళ్ల 2016లో తాడూరు జెడ్పీటీసీగా గెలుపొంది.. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగారు. 1999 నుంచి 2014 వరకు దామోదర్‌రెడ్డి ఐదుసార్లు అసెంబ్లీకి పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా గెలుపొందాలన్న ఆశయంతో భగీరథ ప్రయత్నం చేసినా ఓ దశలో స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. 2015లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీగా గెలుపొందారు. అనంతరం 2018 జూన్‌లో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పార్టీ కార్యక్రమాలకు దూరం..

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరినప్పటికీ దామోదర్‌రెడ్డి కొంతకాలంగా స్థానిక ఎమ్మెల్యేతో అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగానే ఉంటున్నారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్నట్టు పార్టీ కేడర్‌లో ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీగా పరిస్థితులు మారడంతో వీరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు పార్టీ పెద్దలు ప్రయత్నించినప్పటికీ విఫలమైనట్లుగా తెలిసింది. ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలో దిగాలన్నదే దామోదర్‌రెడ్డి కోరికగా ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

పాత గూటికే వెళతారనే ప్రచారం..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి మళ్లీ బరిలో దిగేందుకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ నుంచి ఆయనకు ఆహ్వానం సైతం అందినట్టు తెలుస్తోంది. అయితే ఆయన మాత్రం పాత గూటికే చేరాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్‌లోకి దామోదర్‌రెడ్డి చేరికపై ఇప్పటికే మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డిని సైతం పార్టీ అధిష్టానం అభిప్రాయాన్ని కోరినట్లు తెలుస్తోంది. గులాబీ పార్టీని వీడాలన్న ఆయన నిర్ణయం ఖాయమైతే మే మొదటి వారంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ప్రియాంకగాంధీ సమక్షంలో పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ ప్రచారాన్ని అటు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సైతం ఖండించారు.

ఖరారు కాని జూపల్లి వేదిక..

సుమారు నాలుగేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీలో అసంతృప్త నేతగా కొనసాగిన సీనియర్ నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు చివరకు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌పై ధిక్కార స్వరం నేపథ్యంలో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. గులాబీ పార్టీ నుంచి జూపల్లి బహిష్కరణ తర్వాత ఆయన ఏ పార్టీలోకి చేరుతున్నారన్న దానిపై ఇంకా స్పష్టతనివ్వలేదు. ఈ నేపథ్యంలో ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారన్న దానిపై జోరుగా చర్చ సాగుతోంది. ఆయన అనుచరులు సైతం చాలావరకు కాంగ్రెస్‌లో చేరుతారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉందని, ఏ పార్టీలో చేరాలన్న దానిపై తానింకా నిర్ణయం తీసుకోలేదని జూపల్లి చెబుతున్నారు.

రుణాలు సకాలంలో వసూలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష

నారాయణపేట: బ్యాంకు లింకేజీ రుణాలను లక్ష్యాలకు అనుగుణంగా సకాలంలో వసూలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, సిబ్బందితో బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియమితకాలం ప్రకారం సంఘాలు, వీఓల సమావేశాలు నిర్వహించి రికార్డులు రాయాలన్నారు. ప్రతి సంఘం ఏ గ్రేడ్‌లో ఉండాలని, సంఘాలకు మంజూరు చేసిన రుణాలను సకాలంలో వందశాతం రికవరీ చేయాలన్నారు. డీఆర్‌డీఓ పర్యవేక్షణలో ఒకశాతం మించి ఎన్‌పీఏలు ఉండకుండా సమీక్షించుకోవాలన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ గ్రౌండింగ్‌లో సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతతో పనిచేయాలన్నారు. వందశాతం ఎంటర్‌ప్రైజెస్ గ్రౌండింగ్ చేయాలన్నారు. వరిధాన్యం కొనుగోళ్లను కేంద్రాల వద్దనే కొనుగోలు చేయాలని, అధికారులు పర్యవేక్షించాలన్నారు. టార్పాలిన్, తూకం మిషన్లు, ధాన్యం తరలింపుకు లారీలను సమకూర్చుకోవాలని, ఏ కేంద్రం నుంచి ఏయే మిల్లులకు తరలించాలనే వివరాలు ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. ధాన్యం అమ్మిన రోజునే రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏపీఎంలు క్షేత్ర పర్యటన చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్, అడిషనల్ డీఆర్‌డీఓ అంజయ్య డీపీఎంలు తదితరులు ఉన్నారు.

పుస్తకపఠనంతో మేధో సంపత్తి

పుస్తక పఠనంతో మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం తన చాంబర్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా విద్యార్థినులకు ఇండియా స్ట్రగుల్ ఫర్ ఇండిపెండెన్స్ పుస్తకాలను కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం వారితో మాట్లాడారు. భారత స్వాంతంత్ర్య పోరాటాలపై రచించిన పుస్తకాలను ప్రతి విద్యార్థి చదివి తెలుసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఇలాంటి పుస్తకాలను చదివి తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి క్రిష్ణమచారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంటికే ఇసుక సరఫరా

పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌ల ద్వారానే సరఫరా చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉనందని కలెక్టర్ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో సామాన్యులకు సైతం ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సాండ్ టాక్స్ పాలసీ మన ఇసుక వాహనం htt pr://trmiv.cff.gov.in/home పేరుతో అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు చేపడుతున్న వారు జిల్లాలోని ఎక్కడికైనా ట్రాక్టర్, టిప్పర్‌ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఆయా మండలాలకు సంబంధించిన సరఫరా చేసేందుకు కమిటీ ఈ విధంగా ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. నారాయణపేట మండలానికి సరఫరా చేసేందుకు ట్రాక్టర్‌కు రూ.4,250, టిప్పర్‌కు రూ.24,100, ఊట్కూర్ మండలంలో ట్రాక్టర్‌కు రూ.3,500, టిప్పర్‌కు రూ.22,000, మక్తల్‌లో రూ.2,750, టిప్పర్‌కు రూ.19,100, దామరగిద్ద మండలంలో రూ.4,250, టిప్పర్‌కు రూ.26వేలు, మద్దూర్ మండలానికి రూ.2,700, నర్వ, క్రిష్ణా, మాగనూర్ మండలాల్లో ట్రాక్టర్‌కు రూ.2,700, ట్రిప్పర్‌కు రూ.19వేలు, మరికల్, ధన్వాడ మండలాలకు టిప్పర్‌కు రూ.24,100 సరఫరా చేసేందుకు కమిటీ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. బుక్ చేసుకున్న అదే రోజు లేదా మరుసటి రోజు వారికి చేరుతుందన్నారు.

ఆస్తుల రిజిస్ట్రేషన్‌లో నిబంధనలు పాటించాలి

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సబ్‌రిజిస్ట్రార్ అధికారి, సిబ్బందికి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ వివరాలు, ప్రక్రియ, రికార్డు గదులను, స్టాంప్‌ల నిల్వ వివరాలను సబ్‌రిజిస్ట్రార్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆస్తుల విక్రయాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన లింక్ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆస్తుల కొనుగోలు, అమ్మకందారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వారికి ఇబ్బందులు రాకుండా రిజిస్ట్రేషన్‌లను తగు జాగ్రత్తలతో నిర్వహించాలని సబ్ రిజిస్ట్రార్ రాంజీ భూక్యకు, అక్కడ ఉన్న సిబ్బందికి సూచించారు.

పాతకేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

- నిందితులకు శిక్ష పడేలా చర్యలు ఉండాలి
- సెల్‌ఫోన్ పోతే వెంటనే ఫిర్యాదు చేయండి



పోలీస్‌స్టేషన్‌లో పరిసరాలను శుభ్రం చేయాలని సూచిస్తున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

మరికల్: పెండింగ్‌లో ఉన్న పాతకేసుల దర్యాప్తులో వేగం పెంచి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ వెంకటేశ్వర్లు పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. మరికల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై ఆరా తీశారు. అలాగే పోలీస్‌స్టేషన్ ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న వాహనాలను వేలం వేయాలని సూచించారు. ప్రహరీ ఎత్తు పెంచేలా ఎమ్మెల్యేతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్‌స్టేషన్‌లో బోరు డ్రిల్లింగ్ చేసి పచ్చదనం పెంచాలన్నారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. న్యాయం కోసం వచ్చి ఫిర్యాదు చేసే వారితో మర్యాదగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎవరినీ కూడా లాకప్‌లో పెడితే సంబంధిత అధికారిపై చర్యలు ఉంటాయన్నారు. సెల్‌ఫోన్‌లు దొంగిలించబడితే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు మలుపుల దగ్గర రేడియం స్టిక్కర్స్‌ను త్వరలోనే వేయించడం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి సమయంలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, ఎస్ఐలు శంకరయ్య, ఎల్లయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల అధ్యయనం ఎంతో ముఖ్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నిరంతరం పుస్తకాలను అధ్యయనం చేస్తే విషయ పరిజ్ఞానం పెరుగుతుందని జడ్చర్ల డిగ్రీ కళాశాలలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సుభాషిణి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో 'విద్యార్థుల స్టడీ ప్రాజెక్టు'పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా విద్యార్థుల్లో తెలుగు సాహిత్య పరిశోధనపై ఆసక్తి, అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్, తెలుగు అధ్యాపకులు డా.ఎస్.నిశ్చల, పుష్పలత, సునీత, హేమలత, ప్రభాకర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


గోవింద్ (ఫైల్)

బాలానగర్: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని కుంటలోపుతండా, గంగధారిపల్లి గ్రామ పంచాయతీలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గంగధారిపల్లికి చెందిన పాత్లావత్ గోవింద్ (42) బొలెరో వాహనాన్ని నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 11వ తేదీన గ్రామంలో ఓ వ్యక్తిని బొలెరో వాహనం ఢీకొంది. దీంతో వాహనాన్ని గ్రామస్తులు వారం తర్వాత ఇచ్చారు. గాయపడిన వ్యక్తి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఇవ్వాలని జరిమానా విధించారు. అయితే ఇప్పటికే వాహనం నాలుగు కిస్తులు సుమారు రూ.80వేలు కట్టడం పెండింగ్‌లో ఉంది. మళ్లీ రూ.10వేలు కట్టాల్సి రావడంతో మనస్తాపానికి గురై గురువారం తండాకు సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లి పశువుల తాడుతో ఉరివేసుకున్నాడు. ఈ సంఘటనపై మృతుడి భార్య పత్లావత్ జంకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి నలుగురు పిల్లలున్నారు. వారిలో ఓ కూతురికి వివాహమైంది.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

తెలకపల్లి: ఆటో బోల్తాపడి నలుగురు గాయపడినట్లు ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని తాళ్లపల్లికి చెందిన ఆటో గురువారం సాయంత్రం మంతటి నుంచి తెలకపల్లికి ప్రయాణికులను తీసుకెళ్తుంది. తెలకపల్లి సమీపంలోకి చేరగానే ప్రమాదవశాత్తు రోడ్డు పక్కకు ఒరిగి బోల్తాపడింది. ఈ ఘటనలో గడ్డంపల్లికి చెందిన గోపాల్‌రెడ్డికి తీవ్ర గాయాలుకాగా.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

4 టిప్పర్లు పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: కృష్ణానది పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఒండ్రుమట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను గురువారం కోదండాపురం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటస్వామి కథనం మేరకు.. మండలంలోని బి.వీరాపురం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా టిప్పర్లతో గద్వాల మండలం వీరాపురం సమీపంలో ఉన్న ఇటుక బట్టీలకు ఒండ్రుమట్టిని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దువాసిపల్లి సమీపంలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఒకరిపై దాడి: కేసు నమోదు

మహమ్మదాబాద్: ఇసుక తరలింపు వ్యవహారంలో ఓ వ్యక్తిపై దాడి జరగగా గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని రంగారెడ్డిపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి తన పొలం దగ్గర వాగులో ఇసుకను ఇతర పనులకు తరలించేందుకు తహసీల్దార్ దగ్గర అనుమతి తీసుకున్నారు. సాయంత్రం సమయంలో దాయాదులైన చెన్నమోళ్ల బాలమణి, మాధవి వాగు వద్దకు వచ్చి తమవాటా డబ్బులు ఇవ్వాలంటూ దుర్భాషలాడి కర్రలతో దాడి చేశారు. దాడిలో శ్రీనివాస్‌రెడ్డి తలకు గాయాలుకాగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వేధింపుల కేసు నమోదు

గద్వాల క్రైం: భార్యను వేధింపులకు గురిచేసిన భర్తపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు. కర్నూల్ జిల్లా క్రిష్ణగిరి మండలానికి చెందిన రంగస్వామికి, గద్వాలకు చెందిన విజయలక్ష్మితో వివాహమైంది. కొన్ని రోజులుగా భార్యను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదు చేయగా, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

గోపాల్‌పేట: మండలంలోని చెన్నూరు శివారులో గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నూరుకు చెందిన పిల్లనగోని రాములు, రామాంజనేయులు గొర్రెల మందను గ్రామ శివారులో మేపుతున్నారు. గురువారం ఉదయం అన్నం తినేందుకు చిన్న గొర్రెపిల్లలను గొర్రెల మంద పక్కనే ఉంచి ఇంటికి రాగా కుక్కలు దాడిచేసి చంపాయి. మొత్తం 9 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు.

రామన్‌పాడుకు 410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చిచేరింది. జూరాల ఎడమకాల్వ ద్వారా 410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని, ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విని యోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

గంజాయి కలకలం!

- సిగరెట్ల రూపంలో విక్రయాలు
- మత్తులో చిత్తవుతున్న యువత.. తరచూ తగాదాలు, దాడులు
- ఇటీవల గద్వాలలో కలకలం రేపిన యువకుల దాడి ఘటన
- ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడుతున్నా.. ఆగని దందా



ఉమ్మడి జిల్లా, సంవత్సరాల వారీగా నమోదున కేసులు..

జిల్లా	2020 కేసులు/అరెస్ట్	2021 కేసులు/అరెస్ట్	2022 కేసులు/అరెస్ట్	2023 (ఇప్పటివరకు) కేసులు/అరెస్ట్
మ.నగర్/పేట	4/13	11/15	24/55	1/4
నాగర్‌కర్నూల్	4/4	11/11	8/8	0/0
గద్వాల	0/0	10/15	4/11	0/2
వనపర్తి	2/3	6/14	3/6	0/0
మొత్తం	10/20	38/55	39/80	1/4



గద్వాల రూరల్: గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఓ వైపు పటిష్ట చర్యలు చేపడుతున్నా.. మరోవైపు ఉమ్మడి పాలమూరు జిల్లాలో మాత్రం ఈ దందా జోరుగా కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా ఆదివారం రాత్రి గద్వాలలో గంజాయి మత్తులో ఇద్దరు యువకులు ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడం, విడిపించేందుకు వెళ్లిన వ్యక్తిపై.. అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై.. చికిత్స అందించేందుకు ముందుకొచ్చిన వైద్య సిబ్బందిపై దాడికి యత్నించడం తీవ్ర కలకలం రేపింది.

సిగరెట్ల రూపంలో అమ్మకాలు.. రూ.లక్షల్లో దందా

గద్వాలతోపాటు, అయిజ, గట్టు, అలంపూరు, శాంతినగర్, మల్దకల్ ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తున్నారు. ముఖ్యంగా మిర్చి పంటలో గంజాయి పంటను అంతరపంటగా గుట్టు చప్పుడుగా సాగుచేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో దీనికి డిమాండ్ ఎక్కువ ఉండడం, జిల్లాలోనూ అధికంగా వినియోగిస్తుండడంతో ఇదే అదునుగా సాగు చేస్తున్నారు. 50గ్రాముల గంజాయిని బహిరంగ మార్కెట్‌లో రూ.300–400 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే ఇలా కొనుగోలు చేసిన గంజాయి ద్వారా అక్రమ వ్యాపారస్తులు 5–10గ్రాముల చొప్పున ఒక సిగరెట్‌ను తయారు చేసి ఒక్కో సిగరెట్‌ను రూ.200–300 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. మొత్తంగా రూ.లక్షల్లోనే దందా సాగుతున్నట్లు సమాచారం.

యువకుల చర్యతో కలకలం..

సులువుగా డబ్బు సంపాదించాలనే క్రమంలో గంజాయి దందా నిర్వహిస్తున్న విక్రయదారులు యువకులనే లక్ష్యంగా చేసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. యువకులలో అత్యధికంగా బడాబాబుల కుటుంబాలకు చెందిన పిల్లలే ఉండడంతో అక్రమార్కులు సులువుగానే రూ.లక్షలు జేబులు నింపుకొంటున్నట్లు తెలిసింది. గద్వాలలో పేరుగాంచిన ఓ వైద్యుడు, ఇరిగేషన్‌ శాఖలో విధులు నిర్వర్తించే ఓ ఉన్నతాధికారి, సీడ్ వ్యాపారి కుటుంబాలకు చెందిన పిల్లలు మత్తు మందుకు బానిసలుగా మారినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా, ఇటీవల హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు గద్వాలలోని ఓ హోటల్ వద్ద ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వీరిని విడిపించబోయిన ఓ వ్యక్తిని సైతం తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ కూడా వైద్యసిబ్బందిపై, పోలీసులపై దాడికి యత్నించారు. దీంతో చేసేది లేక ఇద్దరికి మత్తు మందు ఇచ్చేదాకా వారికి చికిత్స అందించటానికి వీలు పడలేదు. వీరిద్దరూ గంజాయి సేవించడంతోనే ఆ మత్తులో ఈ దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది.


ఎక్సైజ్‌శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి(ఫైల్)

అడ్డాలు ఇవే..

- మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేట, మోతీనగర్, బంజారాకాలనీ, బండమీదిపల్లి పరిధితో పాటు పట్టణ శివారులో జనసంచారం లేని ప్రాంతాలు గంజాయి పీల్చే వారికి అడ్డాలుగా మారాయి. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్ పరిధిలో ఇప్పటివరకు గంజాయికి సంబంధించిన కేసులు నమోదు కానప్పటికీ.. ఉత్తరాదికి చెందిన కార్మికులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లు సమాచారం.
- నాగర్‌కర్నూల్ పట్టణ శివారులో పాడుబడ్డ భవనాల్లో, నల్లవెల్లి రూట్‌లో, కల్వకుర్తిలోని సబ్‌రిజిస్ట్రార్ ఏరియాలో, భగీరథ, కురుమిద్ద రోడ్‌లో, తిమ్మినోనిపల్లి, గచ్చుబాయి – పంజుగుల రోడ్, ఎల్లికల్ రోడ్‌లో..
- గద్వాల జిల్లా కేంద్రంలోని వేదనగర్, బీసీ కాలనీ, 2వ రైల్వే గేట్, అలంపూర్ పట్టణ శివారు, ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో శాంతినగర్, అయిజలోని తదితర ప్రాంతాల్లో..
- వనపర్తిలోని పెబ్బేరు రూట్‌లోని అటవీ ప్రాంతంలో, చందాపూర్ రోడ్డు వైపు శ్మశానవాటిక సమీపంలో, రాజీవ్ గృహకల్ప సమీపంలో, కొత్తకోట మండలం కానాయిపల్లి, సంకిరెడ్డిపల్లి శివార్లలో..

ఉపేక్షించం..



గంజాయి సాగుపై నిరంతరం నిఘా ఉంచాం. అనుమానిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు ప్రత్యేక టీంలతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. గద్వాల పట్టణంలో సిగరెట్ రూపంలో గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం లేదు. దీనిపై నిఘా ఉంచి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.

– గోపాల్, ఎక్సైజ్ సీఐ, జోగుళాంబ గద్వాల

దీనిపై రూరల్ ఎస్ ఆనంద్‌ను వివరణ కోరగా.. ఇద్దరు యువకులు కూడా చిత్తు కాగితాలు సేకరించే యాచకులని, ఎవరూ కూడా వారిపై ఫిర్యాదు చేయలేదని, దీంతో వారిని వదిలేశామన్నారు.

తరచూ దాడులు.. రూ.లక్షల విలువైన గంజాయి పట్టివేత

గతేడాది నవంబర్‌లో రూ.లక్షల విలువ చేసే డ్రై గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. నవంబర్ 3వ తేదీన టోల్‌ప్లాజ్ వద్ద తనిఖీలు నిర్వహించగా కర్నూల్ జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన ఇద్దరు యువకుల నుంచి 1.30కేజీల డ్రై గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నవంబర్ 30వ తేదీన బిహార్‌కు చెందిన వ్యక్తి శరవణ్ ఎర్రవల్లిలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తుండేవాడు. అతను సైతం అక్రమంగా 1.20కేజీల గంజాయిని విక్రయిస్తుండగా సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అదేవిధంగా గద్వాల, గట్టు, అయిజ మండలాల్లో 2021, 2022లో ఎక్సైజ్‌శాఖ జరిపిన దాడుల్లో గంజాయి సాగు మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. కానీ, పూర్తిస్థాయిలో గంజాయి రవాణా, విక్రయాలు అరికట్టడంలో మాత్రం విఫలమవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మహిళ హ్యాండ్‌బ్యాగ్‌లో 7 తులాల బంగారం అపహరణ

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికుల బ్యాగుల నుంచి విలువైన బంగారం, డబ్బులు చోరీ చేయడం పరిపాటిగా మారింది. ఇటు పోలీసులు.. అటు ఆర్టీసీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. తాజాగా బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారం అపహరించారు. టూటౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని శివశక్తినగర్ కాలనీకి చెందిన శ్వేత తన పిల్లలు అక్షిత, శశాంక్‌తో కలిసి గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వనపర్తి వెళ్లడానికి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు చేరుకుంది. ఈ క్రమంలో వనపర్తి వెళ్లడం కోసం బస్టాండ్‌లో పది నిమిషాల పాటు బస్సు కోసం ఎదురుచూడగా ఖిల్లాఘణపురం బస్సు వచ్చింది. దీంతో ఆమె బస్సు ఎక్కిన తర్వాత టికెట్ తీసుకోవడానికి హ్యాండ్ బ్యాగ్ చూడగా అప్పటికే హ్యాండ్ బ్యాగ్ ఓపెన్ చేసి ఉండటం, బ్యాగ్‌లో ఉన్న 7తులాల బంగారం ఆభరణాలు, ఐదు తులాల వెండి పట్టీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ విషయమై బాధితురాలు శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నగల దుకాణంలో చోరీ

మద్దూరు: మండల కేంద్రంలోని నగల షాపులకు వెండి ఆభరణాలు సరఫరా చేసే నగల వ్యాపారి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. సికింద్రాబాద్‌కు చెందిన వెండి నగల వ్యాపారి చంపాలాల్ మద్దూరులోని నగల వ్యాపారులకు ప్రతి గురువారం (సంత కావడంతో) ఇక్కడికే వచ్చి వెండి నగలను సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం కొన్ని షాపుల్లో వ్యాపారం చూసుకొని రవికుమార్ అనే వ్యక్తి షాపుకు వచ్చాడు. తన వెంట తీసుకొచ్చిన వెండి నగల బ్యాగును పక్కనే ఉంచుకొని రవికుమార్‌తో మాట్లాడుతున్న క్రమంలో రోడ్డుపై నుంచి షాపులోకి దొంగ వచ్చి బ్యాగు తీసుకొని పారిపోయాడు. రెనివట్ల చౌరస్తా వద్ద దొంగను ఎక్కించుకొని వెళ్లడానికి మరో వ్యక్తి బైక్‌పై సిద్ధంగా ఉండడంతో నారాయణపేట రోడ్డువైపు పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. 7కిలోల 250గ్రాముల వెండి ఆభరణాలు బ్యాగులో ఉన్నాయని, వాటి విలువ రూ.5లక్షలపైనే ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లాండ్రీ షాప్ దగ్ధం


మహమ్మదాబాద్‌లో మంటల్లో లాండ్రీషాప్

మహమ్మదాబాద్: ప్రమాదవశాత్తు లాండ్రీషాప్ దగ్ధమైంది. సుమారు రూ.రెండు లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటన మహమ్మదాబాద్ మండలంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలు... మండల కేంద్రంలోని చాకలి దస్తయ్య ఎస్టీ హాస్టల్ ఎదుట రోడ్డుపై చిన్నపాటి డబ్బా పెట్టుకుని బట్టలు ఇస్త్రీ (ఐరన్) చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదే తరుణంలో ఎప్పటిమాదిరిగా బుధవారం కూడా బట్టలు ఇస్త్రీ చేసి పెట్టి డబ్బాకు తాళం వేసకుని వెళ్లిపోయాడు. అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తగిలి డబ్బకు నిప్పంటుకున్నది. టీ విషయం తెలియడంతో యజమాని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఆలస్యంగా రావడంతో అప్పటికే షాపు సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. షాపులో ఉన్న ఆయా గ్రామాల లీడర్ల విలువైన విలువైన దుస్తులు, కస్టమర్ల దుస్తువులతో బాటు 5వేల నగదు ఉన్నట్లు బాదితుడు తెల్పుతున్నాడు. తన కుటుంబాన్ని పోషించుకునే ఒకే ఒక్క ఆధారం కోల్పోవడంతో తనకు దిక్కేమిటంటూ బోరుమంటున్నాడు. ఆర్థికంగా నిరుపేదనైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. విషయం తహసీల్దార్‌కు తెలిపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వేరుశనగ పొల్లు దగ్ధం

అచ్చంపేట రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో బొల్లు నరసయ్యకు చెందిన వేరుశనగ పొల్లు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. పశువుల మేత కోసం సుమారు రూ.లక్ష వెచ్చించి వివిధ ప్రాంతాల్లో పొల్లు కొనుగోలు చేసి తీసుకొచ్చామని నరసయ్య తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా విద్యుత్ తీగల వల్ల వచ్చిన నిప్పు కుప్పపై పడటంతో పొల్లు, కవరు, నాగలి, గుంటిక, వరిగడ్డి కాలిపోయింది. ఇది గమనించి అచ్చంపేట ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సగానికి పైగా పొల్లు కాలిపోయింది. రైతుకు నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

స్కూల్‌కు నిప్పు!

జడ్చర్ల: స్థానిక కావేరమ్మపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జెడ్పీహెచ్‌ఎస్‌లోని ఓ తరగతి గదిలో ఆకస్మికంగా మంటలు చెలరేగి బయటకు పొగలు కమ్ముడంతో, చుట్టుపక్కల వారు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక సీఐ రమేశ్‌బాబు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సకాలంలో ఫైర్ సిబ్బందికి స్కూల్ దగ్గరకు చేరుకుని మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. తరగతి గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని సీఐ తెలిపారు. రెండు బెంచీలతో పాటు కొన్ని పుస్తకాలు అగ్నికి ఆహుతయ్యాయని, సంబంధిత పాఠశాల హెచ్‌ఎం మైనొద్దీన్ తెలిపారు.


తరగతి గదిలో కాలిపోతున్న సామగ్రి

బాలుడు అదృశ్యం


నందకుమార్ (ఫైల్)

నవాబుపేట: పాఠశాలకు వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి రాకపోవటంతో నానమ్మ సంపంగి జానమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని లింగన్నపల్లికి చెందిన సంపంగి నందకుమార్(7) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్తున్నట్లు నాయనమ్మకు చెప్పి బడికివెళ్లాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకాపోవడంతో ఆమె గ్రామంలో వెతికింది. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. కాగా, బాలుడి తల్లి లేకపోవడంతో నానమ్మ వద్దనే బాలుడు ఏడాది వయస్సు ఉన్నప్పటి నుంచి ఉంటున్నాడు.

సీసీరోడ్డు నాణ్యతపై అభ్యంతరం

- సర్పంచ్ వర్గీయులు, తండావాసుల మధ్య ఘర్షణ



అమరచింత: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించడం లేదని తండావాసులు కాంట్రాక్టర్‌తో గురువారం వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేసుకున్న సంఘటన మండలంలోని చంద్రనాయక్‌తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి మంజూరైన రూ.20లక్షలతో సీసీ రోడ్లను వేసేందుకు సర్పంచ్ వర్గీయులు శ్రీకారం చుట్టారు. మొదటగా పనులను సర్పంచ్ శిల్ప సోదరుడు రాజ్‌నాయక్ కాంట్రాక్ట్ తీసుకోని గత నెలలో 135 మీటర్ల మేర పనులను చేశాడు. బుధవారం తండాలోని మారెమ్మ గుడి నుంచి 90 మీటర్ల మేరకు పనులు ప్రారంభించారు. ఈక్రమంలో గతంలో వేసిన రోడ్డు పనులు నాణ్యతగా లేవని, క్యూరింగ్ సైతం చేయలేదని తండావాసులు వాదనకు దిగారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా నాణ్యత పాటించకుండా పనులను చేయడం ఏమిటని ప్రశ్నించి పనులను అడ్డుకున్నారు. దీంతో గుత్తేదారుడి వర్గానికి చెందిన వ్యక్తులు తండావాసులతో ఘర్షణ పడ్డారు. దీంతో గుత్తేదారుడు తమపై దాడికి పాల్పడ్డాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుత్తేదారుడి వర్గీయులు సైతం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడుకు వివరణ కోరగా.. ఫిర్యాదులు చేసుకున్న విషయం వాస్తవమని, ఇరువురు తండాలో మాట్లాడుకుంటామని వెళ్లిపోయారని ఎస్‌ఐ తెలిపారు.

మంద నిలబెడదాం.. భూసారం పెంచుదాం


పొలంలో మందకట్టిన గొర్రెలు

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వర్షాకాలం, యాంసగిలో సాగు చేసిన పంటలు రైతుల చేతికి అందాయి. పంట సాగు చేసిన పొలాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. పొలాల్లో భూసారం పెంచుకోవడానికి గొర్రెలు, మేకల మందను కట్టించాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. జీవాల మలమూత్రాలు సేంద్రియ ఎరువులుగా మారి పంట భూములకు అవసరమైన పోషకాలను అందిస్తాయని ఏడీఏ వివరించారు. పొలాల్లో గొర్రెలు, మేకల మందలు కట్టించడం వలన వచ్చే సీజన్‌లో వేసే పంటలకు మేలు కలుగుతుంది. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వలన తెగుళ్ల ఉధృతి పెరగడంతోపాటు సాగు వ్యయం ఖర్చు సైతం పెరుగుతుందని పేర్కొన్నారు. దీన్ని తగ్గించుకోవడానికి యాసంగి సీజన్‌లో పొలాలు ఖాళీ అవుతుండటంతో మంద కట్టడంపై రైతులు ఆసక్తి కనబర్చాలని సూచించారు. ప్రస్తుతం అవకాశం ఉన్న రైతులు తమ పొలాలు ఖాళీ అవుతుండటంతో గొర్రెలు, మేకలతో మంద కట్టించుకోవాలన్నారు.

ఇలా చేసుకోవాలి

గొర్రెలు, మేకల దొడ్లలలో పశువుల ఎరువుల మాదిరిగా నిల్వ చేసి పొలానికి వాడుకోవచ్చు. యాసంగిలో మినుము తీత వరికోత పూర్తవ్వగానే ఆయా పంట పొలాల్లో జీవాల మంద కట్టిస్తున్నారు. మంద కట్టిస్తే జీవాలు మలమూత్రాలను విసర్జిస్తాయి. అవి సేంద్రియ ఎరువుగా భూమికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. మంద కట్టిన తర్వాత ఒకసారి పొలాన్ని దుక్కిదున్నిస్తే ఎరువు నేలలో కలిసిపోయి పోషకాలు వృథా కాకుండా ఉంటాయి.

గొర్రె పెంచికలలో పోషకాల విలువ గ్రాములు/కిలో

నత్రజని	భాస్వరం	పొటాష్	కాల్షియం
11.0	5.0	3.2	9.0

మాంగనీస్	ఇనుము	ఉదజని సూచిక
0.15	0.99	7.6

వలస వచ్చి జీవనం

అలంపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు జీవాల పెంపకందార్లు వలస వస్తుంటారు. జిల్లాలోని పెబ్బేరు, కొత్తకోట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి జీవాలు ఇక్కడికి వస్తాయి. ఈ ఏడాది దాదాపు 40వేల జీవాలు వలస వచ్చాయి. రెండు నెలల క్రితమే జీవాల పెంపకందార్లు వచ్చారు. ఖాళీ భూముల్లో జీవాలను మేపుతూ నెలల తరబడి జీవనం గడుపుతుంటారు. మంద కట్టించడం ద్వారా పొలాలకు పోషకాలను అందించడంతోపాటు పెంపకందార్లను ఆదరించినట్లు అవుతుంది.

మంద కట్టడం ద్వారా జీవనం

పంట పొలాల్లో మేకలు, గొర్రెలను మంద కట్టించడం ద్వారా పెంపకందార్లు జీవనం సాగిస్తారు. ఎకరం పొలంలో సుమారు వెయ్యి వరకు జీవానుల మందకట్టిస్తారు. ఇందుకుగాను రైతులు ఒక్కొక్కరు రూ.300 నుంచి రూ.500 వరకు పెంపకందార్లకు ఇస్తారు. ఇలా వచ్చిన సొమ్ముతోపాటు జీవాల పిల్లలను అమ్మకం ద్వారా పెంపకందార్లు జీవనం గడుపుతుంటారు.

మద్యం మత్తులో పోలీసుల విధులకు ఆటంకం

- ఎస్‌ఐ కలర్ పట్టుకున్న యువకుడు

మహబూబ్‌నగర్ క్రైం: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. టూటౌన్ ఎస్‌ఐ సాయికుమార్ కథనం ప్రకారం.. ఈనెల 19న రాత్రి 11గంటల ప్రాంతంలో పట్టణంలోని శ్రద్ధ జూనియర్ కళాశాలలో గొడవ జరుగుతున్నట్లు డయల్ 100కు ఫోన్ రావడంతో పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో గొడవపడుతున్న వ్యక్తులు పారిపోగా.. విజయ్ ప్రకాష్ అనే యువకుడు అక్కడే ఉన్నాడు. మద్యం మత్తులో ఉన్న సదరు యువకుడు అక్కడికి వెళ్లిన పోలీసులతో గొడవపడ్డాడు. దీంతో అతన్ని స్టేషన్‌కు తీసుకురాగా.. విధుల్లో ఉన్న ఎస్‌ఐ శ్రీకాంత్ షర్ట్ కలర్ పట్టుకోవడంతో పాటు దుర్భాషలాడాడు. కానిస్టేబుల్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్ ప్రకాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

క్లుప్తంగా...

అన్ని ప్రశ్నలకు అవినాశ్‌రెడ్డి సమాధానాలు

- రెండో రోజు సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఎంపీ అవినాశ్‌రెడ్డిని గురువారమూ విచారించారు. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు ఎంపీ అవినాశ్‌రెడ్డి సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు వరుసగా రెండో రోజు సీబీఐ అధికారుల దర్యాప్తునకు ఎంపీ అవినాశ్‌రెడ్డి హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు ఆయనకు లిఖిత పూర్వకంగా ప్రశ్నలు అందించారు. వాటన్నింటికీ ఎంపీ సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డు చేశారు. శుక్రవారం సైతం ఆయన సీబీఐ ఎదుట విచారణకు హాజరుకానున్నట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను గురువారం రెండో రోజు ఆరు గంటల పాటు ప్రశ్నించారు. దర్యాప్తు సందర్భంగా న్యాయవాదిని అనుమతించి, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఆడియో, వీడియో రికార్డింగ్‌పై హైకోర్టు గురువారం జారీ చేసిన ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. అనంతరం భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి విచారణ పూర్తయ్యే వరకు వారి న్యాయవాదులను అనుమతించాలని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు విచారణ జరపాలని, ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టం చేసింది. న్యాయవాదిని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే సీబీఐ అనుమతించిందని, విచారణ ముగిసే దాకా ఉండేలా ఆదేశాలివ్వాలని భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సురేందర్ గురువారం విచారణ జరిపారు.

బీఈడీలో ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్

సాక్షి, హైదరాబాద్: బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీల రిజర్వేషన్‌ను పెంచారు. గతంలో ఉన్న 6శాతం రిజర్వేషన్‌ను 10శాతానికి పెంచారు. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి కరుణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంసెట్ సహా వివిధ సెట్స్ ద్వారా జరిగే ప్రవేశాలకు ఈ తరహా రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులిచ్చింది.

100 మంది మహిళలతో మిల్లెట్ ఔట్‌లెట్లు



త్వరలోనే ఔత్సాహికుల ఎంపిక.. ఔట్‌లెట్ల కేటాయింపు

- పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణాలు ఇప్పించనున్న టీఎస్ ఆగ్రోస్
- చిరుధాన్యాల ఉత్పత్తులు సరఫరా చేయనున్న అక్షయపాత్ర ఫౌండేషన్
- ఔత్సాహికులకు ఐఐఎంఆర్‌లో అవగాహన కల్పించిన ఇరు సంస్థలు

సాక్షి, హైదరాబాద్: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వారిని వ్యాపారవేత్తలుగా మలిచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని టీఎస్ ఆగ్రోస్ చర్యలు చేపట్టింది. మార్కెట్లో డిమాండ్‌గల చిరుధాన్యాల ఉత్పత్తుల వ్యాపారంలో మహిళలను భాగస్వాములను చేయాలని, స్టార్టప్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వారితో రాష్ట్ర వ్యాప్తంగా చిరుధాన్యాలు, వాటి ఉత్పత్తులను విక్రయించేందుకు ఔట్‌లెట్స్ ఏర్పాటు చేయించనుంది. ఈ దిశగా కసరత్తులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి వంద మందికిపైగా ఔత్సాహిక మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ విజయసింహారెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ప్రత్యేక కమిషనర్ హనుమంతు, ఆగ్రోస్ ఎండీ రాములు, అక్షయపాత్ర, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలి దశలో...

మిల్లెట్ ఔట్‌లెట్లను తొలిదశలో జిల్లా కేంద్రాల్లో ఒకట్రెండు చొప్పున, జీహెచ్‌ఎంసీ పరిధిలో పది ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలని టీఎస్ ఆగ్రోస్, అక్షయపాత్ర నిర్ణయించాయి. త్వరలోనే ఔత్సాహిక మహిళల్ని ఎంపిక చేసి వారికి ఔట్‌లెట్లు కేటాయించేలా కసరత్తు జరుగుతోంది. మిల్లెట్ ఔట్‌లెట్లలో అక్షయపాత్ర కీలకపాత్ర పోషించనుంది. వ్యాపారానికి అవసరమైన చిరుధాన్యాలను, వాటి ఉత్పత్తులను ఈ సంస్థనే సరఫరా చేయనుంది. దీంతోపాటు ప్రత్యేకంగా షాప్ అద్దెకు తీసుకోలేని వారి కోసం ప్రత్యేకంగా కంటెయినర్ షాప్‌లను కూడా అక్షయపాత్ర రూపొందించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే టీఎస్ ఆగ్రోస్, అక్షయపాత్ర మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. చిన్నారులు మొదలుకొని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధుల వరకు అవసరమైన చిరుధాన్యాల ఆహారాలను ఈ సంస్థ అందించనుంది. మొత్తం 68 రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచనుంది. ముఖ్యంగా చిన్నపిల్లల కోసం చిరుధాన్యాలతో నూడుల్స్, బిస్కెట్స్ వంటి వాటిని కూడా తయారు చేస్తోంది. ఔత్సాహిక మహిళలు పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేకుండానే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా టీఎస్ ఆగ్రోస్ రుణాలు ఇప్పించనుంది. సదస్సులో పాల్గొన్న బ్యాంక్ ప్రతినిధులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఒక్కొక్కరికీ వ్యాపార విస్తరణ, పెట్టుబడిని బట్టి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు రుణాలు అందించేందుకు బ్యాంకు ముందుకొచ్చింది. ఈ కార్యక్రమం అనంతరం ఔత్సాహిక మహిళలకు ఏర్పాటు చేసిన భోజనంలో మిల్లెట్ పులిహోర, మిల్లెట్ సాంబార్ ఫుడ్, మిల్లెట్ కర్డ్ ఫుడ్, మిల్లెట్ రోటీ, మిల్లెట్ ఐస్‌క్రీం వంటి వాటిని అందించారు.

మరో వంద ప్రాథమిక సహకార సంఘాలు

- గ్రామానికో సంఘం ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు కేంద్ర సహకార శాఖ సూచన
- అలాగైతే రాష్ట్రంలో 12 వేలకు పైగా ఏర్పాటు చేయాలి
- కానీ, సాధ్యంకాదని తెలంగాణ వాదన
- ప్రస్తుతం 906 ఉండగా, మరో 100 పెంచాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: దేశంలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్ర సహకారశాఖ నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతీ గ్రామానికి ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఉండాలని రాష్ట్రాలకు సూచించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 906 సహకార సంఘాలున్నాయి. కేంద్రం సూచనను అమలు చేయాల్సి వస్తే, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 12,769 గ్రామాల్లోనూ ప్యాక్స్‌ను ఏర్పాటు చేయాలి. అయితే అలా చేయడం వాణిజ్యపరంగా ఏమాత్రం లాభదాయకం కాదని, పైగా వాటిని నడిపించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తేల్చిచెప్పింది. ప్రస్తుతం రాష్ట్రంలో మండలానికో ప్యాక్స్ ఉండగా, కొన్ని జిల్లాల్లో మండలానికో రెండు చొప్పున ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామానికో ప్యాక్స్ సాధ్యం కాకున్నా, ఇప్పుడున్న ప్యాక్స్ సంఖ్యను రెట్టింపు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు టెస్కాబ్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతానికి మాత్రం కొత్తగా 100 ప్యాక్స్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అక్కడి నుంచి అనుమతి వస్తే త్వరలో ఏర్పాటు చేస్తారు.

రైతులకు మరిన్ని సేవలు...

రైతులకు రుణాలతోపాటు పలు రకాల సేవలు అందించడంలో ప్యాక్స్ కృషి చేస్తున్నాయి. కొత్త ప్యాక్స్ ఏర్పాటుతో రైతులకు సేవలు మరింత చేరువకానున్నాయి. రాష్ట్రంలోని మెజార్టీ ప్యాక్స్ ప్రస్తుతం రైతులకు రుణాలు ఇవ్వడం, ధాన్యం కొనుగోలు చేయడం వంటి మూడు నాలుగు సేవలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్యాక్స్‌ను కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ)గా మార్చి రైతులకు సుమారు 25–30 సేవల్ని అందించే విధంగా టెస్కాబ్ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు కొత్త మండలాలను, కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పాటు చేసిన మండలాలు, గ్రామ పంచాయతీల్లో ప్యాక్స్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడి రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వంద ప్యాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాగా, 2005కు ముందు తెలంగాణ ప్రాంతంలో 1800 వరకు ప్యాక్స్ ఉండేవి. కానీ వైద్యనాథన్ కమిషన్ సిఫార్సులతో ప్యాక్స్‌ల సంఖ్యను కుదించారు. దీంతో వాటి సంఖ్య 906కు పడిపోయిందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. రైతులకు ఉత్తమ, నాణ్యమైన సేవల్ని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఆడిటర్‌ను నియమించే అధికారం ఉంది

- మార్గదర్శి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు
- మార్గదర్శి బ్యాలెన్స్ షీట్‌ను ఫైల్ చేయడం లేదు
- లోపాలున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది

సాక్షి, హైదరాబాద్: 'చిట్‌ఫండ్స్‌కు సంబంధించిన అవకతవకలపై ప్రాథమిక ఆధారాలున్నప్పుడు నిశితంగా పరిశీలించి నిగ్గు తేల్చేందుకు ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్లు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. అసలు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు'అని తెలంగాణ హైకోర్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించింది. మార్చి 13, 15, 18న ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ – ఐజీ ఇచ్చిన ఆదేశాలను కొట్టి వేయడంతోపాటు ఆడిటర్ వేములపాటి శ్రీధర్ నియామకాన్ని, తమ సంస్థలో ఆయన ద్వారా ఆడిటింగ్ చేపట్టడాన్ని రద్దు చేయాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ సుదీర్ఘంగా వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

హైకోర్టుల పరిధిని సుప్రీం స్పష్టంగా చెప్పింది

'తనిఖీలు నిర్వహించిన 37 బ్రాంచీలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. కేసులు అక్కడే నమోదయ్యాయి. విచారణ అధికారులు కూడా అక్కడివారే. అలాంటప్పుడు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయడం సరికాదు. పరిధి కాకున్నా మార్గదర్శి ప్రతిసారీతెలంగాణ హైకోర్టులోనే పిటిషన్లు దాఖలు చేస్తోంది. వీటిపై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు. మార్గదర్శి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వీటిపై క్షుణ్నంగా పరిశీలన జరిపేందుకు ఆడిటర్‌ను నియమించాం. చిట్‌ఫండ్స్ చట్టం సెక్షన్ 61 సబ్ సెక్షన్ 2 ప్రకారం ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. సబ్ సెక్షన్ 4 ప్రకారం డాక్యుమెంట్లను ఆడిట్ చేసే అధికారం కూడా ఉంది. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాల్లో తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా నిర్వచించింది. ఒక హైకోర్టు పరిధిలో మరో హైకోర్టు పరిధి దాటి కలుగజేసుకోరాదని ఆదేశించింది'అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి నివేదించారు.

60 ఏళ్లైనా తప్పు తప్పే అవుతుంది

'సేకరించిన నగదును అక్రమ మార్గాల్లో సొంత కంపెనీలకు, షేర్ మార్కెట్లకు, మ్యూచువల్ ఫండ్స్‌కు మార్గదర్శి మళ్లిస్తోంది. దాదాపు 46 రోజుల తర్వాత కోర్టును ఆశ్రయించడం సమర్థనీయంకాదు. దాదాపు 6 దశాబ్దాలుగా చిట్‌ఫండ్స్ నడుపుతున్నామని పిటిషనర్ చెబుతున్నారు. 60 దశాబ్దాలుగా నడుపుతున్నా.. తప్పు తప్పే అవుతుంది కానీ ఒప్పు కాదన్న విషయం గ్రహించాలి. కొన్ని సంవత్సరాలుగా మార్గదర్శి బ్యాలెన్స్ షీట్ ఫైల్ చేయడం లేదు. లాభ నష్టాలకు సంబంధించి దీన్ని ఏటా ప్రభుత్వానికి తప్పకుండా సమర్పించాలి. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ వద్ద ఫైల్ చేస్తున్నామంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇది చట్టాలను ఉల్లంఘించడమే. వీటిని పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టివేయాలి'అని స్పెషల్ జీపీ గోవిందరెడ్డి కోరారు. కాగా, ఈ కేసులో ప్రభుత్వం నియమించిన ఆడిటర్ కౌంటర్ దాఖలు చేయకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వవద్దని ఆడిటర్ తరఫు న్యాయవాది పట్టాభి పేర్కొన్నారు.

'మార్గదర్శి'లో కొనసాగుతున్న సోదాలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో వరుసగా రెండో రోజు గురువారం కూడా సీఐడీ సోదాలు కొనసాగాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో సోదాలు జరిపి కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులు, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బ్రాంచి కార్యాలయాలు, ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో వివరాలకు ఏమాత్రం పొంతన లేదన్న విషయాన్ని సీఐడీ గుర్తించింది. దీనిపై బ్రాంచి మేనేజర్లు, సిబ్బందిని ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను నమోదు చేస్తున్నారు. దాదాపు 15 అంశాలకు సంబంధించి అవకతవకలను గుర్తించినట్లు తెలిసింది. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో శుక్రవారం కూడా సీఐడీ సోదాలు కొనసాగనున్నాయి. ఈ సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం తదుపరి కార్యాచరణను వేగవంతం చేయాలని సీఐడీ భావిస్తోంది.

అరెస్టు భయంతో అందుబాటులో లేని మేనేజర్లు..

ఏలూరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు కార్యాలయంలో అందుబాటులో లేరని చెబుతున్నారు. ఇప్పటికే ముందస్తు బెయిల్ తీసుకున్నారని, అయినా అరెస్టు చేస్తారనే భయంతో కార్యాలయానికి రావడం లేదని అంటున్నారు. మార్గదర్శిలో చిట్స్‌కు సంబంధించి ఖాతాదారుల వివరాలు, చిట్ల చెల్లింపులు, జమలకు సంబంధించి రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. సీఐడీ డీఎస్పీ స్థాయి అధికారులతో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించి పలువురు అధికారులు ఈ సోదాల్లో పాల్గొంటున్నట్టు సమాచారం.

వాళ్లు ఏమైనట్టు..?

- వ్యక్తి ఆత్మహత్య
- వీడని భార్య, కూతురి అదృశ్యం మిస్టరీ
- మూడేళ్ల క్రితం మొదటి భార్యకు తెలియకుండా రెండో వివాహం
- తల్లిదండ్రులకు కూతురి సమాచారం ఇవ్వని రామకృష్ణ
- కూతురి ఆచూకీ కోసం వచ్చారని తెలిసి బలవన్మరణం

మొయినాబాద్: మొదటి భార్యకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడు. నమ్మి పిల్లనిచ్చిన అత్తింటివారికి కూతురి సమాచారం తెలియనీయలేదు. ప్రస్తుతం వారు ఎక్కడున్నారు.. ఏమయ్యారో చెప్పకుండానే ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు మిస్టరీని ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన రామకృష్ణ(40) మొయినాబాద్ మండలం సురంగల్‌కి చెందిన మల్లమ్మను 2013లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. 2018లో బతుకుదెరువు కోసం చిలుకూరు గ్రామంలోని ఇంద్రారెడ్డినగర్‌కు వచ్చారు. రామకృష్ణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పనులు దొరక్క మూడేళ్ల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటకు వెళ్లాడు. అక్కడ కోళ్ల ఫారంలో పని చేశాడు. ఆ సమయంలో ఇందిరతో పరిచయం ఏర్పడి పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు ఓ కూతురు పుట్టింది. రెండు సంవత్సరాల క్రితం ఇందిరను, పాపను చిలుకూరులోని ఇంద్రారెడ్డినగర్‌కు తీసుకొచ్చాడు. అప్పటి నుంచి ఇందిర సొంత ఊరికి వెళ్లలేదు. ఆమె కుటుంబసభ్యులు పలుసార్లు రామకృష్ణకు ఫోన్ చేసి ఇంటికి రావాలని, కూతురితో మాట్లాడించాలని కోరారు. ఫోన్ చేసిన ప్రతిసారి ఏదో ఒక సాకు చెప్పి ఫోన్ పెట్టేసేవాడు. దీంతో ఇందిర కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి నాలుగు రోజుల క్రితం తిమ్మాజీపేటకు వచ్చారు. రామకృష్ణకు ఫోన్ చేస్తే తీయకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం ఇందిర తల్లి, కుటుంబసభ్యులు చిలుకూరులో రామకృష్ణ ఉంటున్న ఇంటికి వచ్చి డోర్ కొట్టారు. వారిని కిటికీలోంచి చూసిన రామకృష్ణ.. భయాందోళనకు గురై బెడ్‌రూంలోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇందిర, పాప సమాచారం తెలియకుండా పోయింది. రామకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రామకృష్ణ మృతితో తమ కూతురు ఇందిర, పాప సమాచారం తెలియకుండా పోయిందని ఇందిర తల్లి ఊశమ్మ బోరున విలపించింది. ఇందిర, పాప ఆచూకీ తెలుసుకోవాలని పోలీసులను వేడుకున్నారు.

ప్రారంభానికి ముస్తాబు

- జడ్చర్లలో 100 పడకలతో ఏరియా ఆస్పత్రి నిర్మాణం
- గ్రామీణులకు అందనున్న మెరుగైన వైద్యసేవలు
- విర్కో ఫౌండేషన్ సౌజన్యంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు



జడ్చర్లలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏరియా ఆస్పత్రి భవనం

జడ్చర్ల టౌన్: పట్టణ సమీపంలోని గంగాపురం రోడ్‌లో వంద పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఏరియా ఆస్పత్రి ప్రారంభానికి ముస్తాబవుతోంది. ఏరియా ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తరువాత ప్రతి నియోజకవర్గంలో ఏరియా ఆస్పత్రి నిర్మాణం చేపడతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. 2016లో ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేశారు. 2018 ఎన్నికల ముందు ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2020లో పనులు ప్రారంభించినా.. కోవిడ్ కారణంగా జాప్యం జరిగింది. కోవిడ్ సమయంలోనే ఆస్పత్రి ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ప్రతిపక్షాలు నినదించాయి. ఎట్టకేలకు భవన నిర్మాణం పూర్తి కావచ్చింది. దీంతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు.

తప్పనున్న రెఫరల్ బాధలు..

ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో అత్యవసర సేవలు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. కొందరు రోగులైతే ప్రభుత్వ ఆస్పత్రికి రాకుండా నేరుగా జిల్లా ఆస్పత్రికి వెళ్తున్నారు. ఇక్కడకు వచ్చి సమయం వృథా చేసుకొనే బదులు నేరుగా వెళ్లడంతో సమయం ఆదా అవుతుందని భావిస్తున్నారు. 100 పడకల ఆస్పత్రి ప్రారంభమైతే సమస్యకు పరిష్కారం లభించనుంది. ప్రధాన విభాగాలన్నీ అందుబాటులోకి రావటంతో మెరుగైన వైద్యసేవలు పొందే ఆస్కారం ఏర్పడుతుంది.



డయాలసిస్ కేంద్రంలో బెడ్లు, మిషనరీ

మే నెలలో ప్రారంభం..

100 పడకల ఆస్పత్రిని మే నెలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆస్పత్రి మంజూరు చేసి పూర్తి చేయించా. విర్కో ఫౌండేషన్ సహకారంతో డయాలసిస్ కేంద్రం నెలకొల్పాం.

– డా.లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

డయాలసిస్ రోగుల కోసం..

ప్రస్తుతం వంశీ ఆస్పత్రిలో డయాలసిస్ అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేట్ కావటంతో ఆరోగ్యశ్రీ లేని వారికి భారంగా పరిణమించింది. ఒకసారి డయాలసిస్ చేస్తే రూ.2,850 వెచ్చించాల్సి వస్తుంది. ఏరియా ఆస్పత్రి ప్రారంభమైతే ఆ బాధలు తప్పనున్నాయి. విర్కో కంపెని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా 10 పడకలతో అత్యాధునిక డయాలసిస్ కేంద్రం ఆస్పత్రిలోనే ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం అన్ని యంత్రాలు రావటంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రెండేళ్ల పాటు విర్కో ఫౌండేషన్ కేంద్రాన్ని నిర్వహించనుంది. భగవాన్ మహవీర్ ట్రస్టు సహకారంతో డయాలసిస్ కేంద్రాన్ని నిర్వహించనున్నామని ఫౌండేషన్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే విన్నపం మేరకు తమ యాజమాన్యం డయాలసిస్ కేంద్రం నిర్వహణకు ముందుకొచ్చిందని.. మిషనరి, బెడ్లు అంతా సిద్ధం చేశామని చెప్పారు.

నేడు జుమ్మతుల్ విదా

రంజాన్‌మాసం చివరి శుక్రవారం ప్రత్యేకం



జామియ మసీద్‌లో రంజాన్ జుమా నమాజు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలకు శుక్రవారం పరమ పవిత్రదినం అందులోనూ రంజాన్ మాసంలో శుక్రవారాలంటే ఎంతో ప్రాధాన్యం. రోజంతా పవిత్రంగా, ఆధ్యాత్మికంగా గడుపుతారు. రంజాన్ మాసంలోని చివరి శుక్రవారానికి 'జుమ్మతుల్ విదా' అంటారు. దీక్షకులకు ఇది పండుగే. జుమా నమాజు కోసం మసీదులన్నీ ముస్తాబయ్యాయి. అధిక సంఖ్యలో వచ్చే ముస్లింలంతా కలిసి జుమా నమాజు చేసేందుకు వీలుగా మజీదుల్లో ఏర్పాట్లు చేశారు.

నమాజ్‌కు ఇలా సిద్ధమవుతారు..

జుమా రోజు ప్రతిఒక్కరూ తెల్లవారుజామునే లేచి ఉషోదయ నమాజు (ఫజర్) ఆచరిస్తారు. అజాన్ అయిన వెంటనే మసీదుకు చేరుకొని సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారు. మహిళలు ఇళ్లలోనే ఖురాన్ పఠనం, నమాజు చేస్తారు. వారంతో ఉత్తమైంది జుమా. హజ్రత్ ఆదమ్‌ను అల్లా సృష్టించాడు, ఆదమ్ స్వర్గంలో ప్రవేశించింది ఈ రోజే. జుమా రోజులోని ప్రత్యేక గడియల్లో ఏదీ కోరుకున్నా అల్లా తప్పకుండా విని ఫలితం చేకూర్చుతారని ముస్లింల విశ్వాసం.

నమాజు ప్రత్యేకం..

జుమా నమాజుకు ముందు రెండు ప్రసంగాలు(ఖుత్బాలు) ఉంటాయి. మొదటి దానిలో ఇమామ్ దైవ స్తోత్రం, ప్రవక్త (స.అ.స)పై శుభాలను పఠిస్తారు. ఇది ఆరాధన వంటిది. రెండవ భాగంగా ఖురాన్‌లోని వచనాలను ధ్యానిస్తారు. ప్రాంతీయ భాషలో ధార్మిక హితబోధన చేస్తారు. జుమా రోజు అజాన్ అయినప్పటినుంచి నమాజు పూర్తయ్యే వరకు ప్రజలు ప్రాపంచిక వ్యాపకాలన్నీ మానివేయాలని ప్రవక్త పేర్కొనట్లు మతపెద్దలు చెబుతున్నారు. నేడు జరిగే జుమ్మతుల్‌విదా నమాజుకు మజీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



జాతర మైదానంలో భక్తుల రద్దీ

కురుమూర్తి గుట్టపై భక్తుల కోలాహలం

చిన్నచింతకుంట: అమావాస్య సందర్భంగా మండలంలోని కురుమూర్తిస్వామి దర్శనానికి గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు తరలి వచ్చి క్యూలో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తు గోవింద నామ స్మరణలతో స్వామి చెంతకు చేరి టెంకాయలు కొట్టి దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన నైవేద్యం తయారు చేసి స్వామికి సమర్పించి వేడుకున్నారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం, జాతర మైదానమంత భక్తుల రద్దీ కనిపించింది.



స్వామి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అగ్నిమాపక శాఖ సేవలు కీలకం



అమరులైన ఫైర్ ఆఫీసర్లు, సిబ్బందికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రైం: విపత్తు సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడటంలో అగ్నిమాపక శాఖ సేవలు మరువలేనివని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా అగ్నిమాపక వారోత్సలు ఈనెల 14నుంచి 20వరకు నిర్వహించగా గురువారం జిల్లా కార్యాలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తులను రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తారన్నారు. సైనికుల మాదిరిగానే మిలిటరీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ పదాది దళాలు పోరాటం చేసినట్లుగానే అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అగ్ని ప్రమాదాల నుంచి ప్రజలను, ఆస్తులను రక్షించడంలో ముందుంటారని తెలిపారు. 24గంటల పాటు విధుల్లో ఉంటూ, అర్ధరాత్రి సమయాల్లో సైతం విషయం ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుంటారని తెలిపారు. జిల్లాలో జడ్చర్ల జాతీయ రహదారితో పాటు మహబూబ్‌నగర్ పట్టణంలో ఫైర్ స్టేషన్స్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సుధాకర్, ఏడీఎఫ్ఓ ధర్మ, ఫైర్ ఆఫీసర్ పద్మయ్య, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.